MAZHAB-0-SIYASAT
(TELUGU)

# మతము-రాజకీయము

రచన:
జలాలుద్దీన్ యూసుఫీ

కరుణించేవాడు కనికరించేవాడు అయిన అల్లాహ్ పేరుతో

# మతము - రాజకీయము

మహాశయులారా!

ప్రస్తుతం నేను మీ ఎదుట నిల్చుని ఈ ఉపన్యాస వేదికపై నుండి మిమ్మల్ని చూస్తున్నాను. మీరంతా దేనికోసం ఇక్కడకు వచ్చింది, నేను మీ ఎదుట దేనికోసం నిలుచున్నది నాకు తెలియకుండానే ఇక్కడ నిలుచున్నానా? అదే విధంగా తామెల్లరు కూడా, ఏ సందర్భంలో ఇక్కడికి విచ్చేశారో నేను మీ ఎదుట దేనికోసం నిలబడి ఉన్నానో మీరు కూడా గ్రహించకనే ఉన్నారా? అలా ఎన్నటికీ జరుగదు.

## మన స్థానం

మనం ఒకరి ఇంట కూర్చుని ఉన్నప్పుడు ఆ ఇల్లు ఎవరిది, ఆ ఇంట్లో మనమెందుకు కూర్చున్నాం, అలా కూర్చోవడానికి మనకు గల హక్కు ఎలా వచ్చింది అనే ఆలోచన మన మనస్సులో మెదలదా? అదే విధంగా మనమొక వస్తువును వాడేటప్పుడు ఆ వస్తువు ఎవరిది, దాన్ని వాడే హక్కు మనకెలా కలిగింది అని తెలుసుకోకనే ఆ వస్తువును మనం వాడుతున్నామా?

ఇవి ఎంత చిన్న ప్రశ్నలైనా వీటిని నిర్లక్ష్యపెట్టే అవివేకి ఎవరూ ఉండరు. ఈ ప్రశ్నలు మానవుని బుద్ధిజ్ఞానాలకు సంబంధించినవి. కాబట్టి జ్ఞానమున్న ప్రతి వ్యక్తి ప్రధమ క్షణంలోనే తన మేధస్సులో ఉత్పన్నమౌతున్న వీటిని గ్రహించి వీటికి అనుగుణంగా ప్రవర్తిస్తాడు.

కాని ఈ ప్రపంచంలో చాలా మంది తామెవరైంది, ఈ ప్రపంచంలో

తామెందుకున్నది, ఈ ప్రపంచంలో నివసించే హక్కు తమకు ఎలా ప్రాప్తించిందీ? అదే విధంగా ఈ ప్రపంచంలో జరిగే గొప్ప చిత్రవిచిత్ర కార్యాలు ఎలా జరుగుతున్నాయి. ప్రపంచంలోని సమస్త వస్తు సముదాయాన్ని తాము ఏ విధంగా తమ అధీనంలో తెచ్చుకొని వాడుకుంటున్నారు. అలా వాడే హక్కు తమకు ఎలా కలిగింది? అనే విషయాన్ని ఏ మాత్రం ఆలోచించకుండా గడుపుతున్నారు. ఇలా ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు, సంవత్సరాల తరబడి తమ జీవితాల్ని వెళ్ళబుచ్చుతున్నారు. ఈ విషయం ఎంత విచిత్రమయినదో ఊహించారా?

మనిషి ఈ ప్రశ్నల పట్ల ఆలోచించనవసరం లేదా? ఈ సృష్టి ఎవరి సొత్తు? దీనికి యజమాని ఎవరు? ఇంతటి బ్రహ్మాండమయిన లోకాన తానెవరు? ఈ సృష్టిలో తన స్థానమేది? ఇక్కడ తాను ఏమి చేయాలి? ఏది చేయకూడదు? తన మరణానంతరం తన విషయంలో ఎలాంటి వైఖరి అనుసరించబడుతుంది? అని తెలుసుకొని తదనుగుణంగా తన జీవిత విధానాన్ని మలచుకోవడం మానవుని ప్రథమ కర్తవ్యం. అయినా ఇలాంటి అతి ముఖ్యమయిన సమస్యను మనిషి నిర్లక్ష్యం చేయడానికి గల కారణమేంటో తెలియడంలేదు.

## మనిషి స్వేచ్ఛాజీవి

మానవ నైజంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ప్రబల ఇచ్ఛ ఉంది. ఇతరులకు బానిసగా విధేయుడుగా జీవించటం అంటే అతను ఇష్టపడడు. మానవుడు ఎల్లప్పుడు తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, తన కోరికలకు ఆటంకంలేని జీవితాన్నే గడపటానికి ఇష్టపడతాడు. తన జీవితంపై ఎలాంటి నిబంధనలు ఆంక్షలు ఉండటం అతనికి నచ్చదు. అయినా ఈ మానవుడు రెండు సందర్భాల్లో మాత్రం ఇతరుల ఆజ్ఞలను శిరసావహించడం, విధేయతకు ఇష్టపడటం అనేది జరుగుతుంది.

ఒకటి: ఒకరు ఇచ్చే ఆజ్ఞలను తిరస్కరించినా వారికి అవిధేయత చూపినా శిక్షపడుతుంది అనే భయం కలిగినప్పుడు, రెండవది: ఆ ఆజ్ఞలు

శిరసావహించినట్లయితే, విధేయత చూపినట్లయితే బహూకరించబడుతుంది అనే ఆశ కలిగినప్పుడు.

బాగా ఆలోచించండి, ఒక వ్యక్తి ఇతరుల సేవ చేసినా, అజ్ఞాపాలన చేసినా, విధేయత పాటించినా అది పై రెండు సందర్భాల్లో ఏదో ఒక సందర్భం ఉండకమానదు. "భయం" కాని "ఆశ" కాని లేకపోతే ఒక వ్యక్తి ఇతరులకు విధేయుడవటానికి సుతరామూ ఒప్పుకోడు.

ఈ స్థితిలో, ఈ సృష్టికి ఒక సృష్టికర్త ఉన్నాడని, ఆయనే దీనికి యజమాని, ప్రభువు అని, మనలనంతా ఆయనే సృష్టించాడని, మనతో సహా ఈ సృష్టి మొత్తం ఆయన సొత్తే అని, ఆయన మన కొరకు నియమించిన విధులను తిరస్కరించటం మనకు తగదని, ఆయనకు విధేయులై ఉండడం మన ప్రథమ కర్తవ్యమని మనం నమ్మవలెనంటే మనం మన ఇష్టపూర్వకంగా మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను వదలుకుని ఆయన చూపెట్టిన భయం, ఆశలను దృష్టిలో ఉంచుకోవాలి. అంటే మన సృష్టికర్త, స్వామి, ప్రభువు అయిన ఆ దైవం ఎదుట మన శిరస్సును వంచనట్లయితే, మనం శిక్షలకు గురి అవుతామన్న "భయం" మరియు విశ్వసించి ఆయన ఎదుట మన శిరస్సును వంచి ఆయనకు విధేయులయి ఉంటే అయన చూపిన బహుమానం పొందుతామన్న "ఆశ" ఉంటేనే తప్ప మానవుడు తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను వదలుకోడానికి ఏమాత్రం ఇష్టపడడు.

## మానవాధికారం పరిమితం

అబద్ధాలాడటం, లంచం పుచ్చుకోవడం అనేవి ప్రభుత్వ చట్టరీత్యా శిక్షార్హమైనవే. అయితే ఒకడు అబద్ధాలాడుతున్నాడు, లంచం తీసుకుంటున్నాడు, అతడు ప్రభుత్వ చట్టాలకు చిక్కక ధనం సంపాదిస్తూ ఆనందభోగాల్ని అనుభవిస్తున్నాడు. ప్రభుత్వ చట్టాలను వ్యతిరేకిస్తూ ఆనందసాగరంలో వోలలాడే ఇట్టి అవకాశాలు మనకు ఈ లోకంలో ఎన్నో ప్రాప్తమవుతున్నాయి. తన చట్టాల్ని

నూటికి నూరుపాళ్ళు అమలు జరిపించటానికి చట్ట వ్యతిరేకంగా నడిచే ప్రతి వ్యక్తిని శిక్షించటానికి ఏ ప్రభుత్వం వద్ద కావలసిన శక్తి లేదు. ప్రభుత్వం వద్దనున్న రక్షక పోలీసు సిబ్బందికి ప్రతి అవిధేయుని చేజిక్కించుకొని బంధించే శక్తి లేదు. ఒక వ్యక్తి దుర్మార్గుడయి ఒక వ్యక్తిని హత్య చేసినా వాడే నలుగురిని హత్యచేసినా, ఆ వ్యక్తి పట్టుబడ్డప్పుడు అతనికి మరణ శిక్ష విధించి అతని ఒక ప్రాణాన్నే తీస్తుంది ప్రభుత్వం. అంతకు మించి శిక్షించే శక్తి ప్రభుత్వానికి లేదు.

ఒకవైపు ఈ ప్రభుత్వ చట్టాలున్నాయి. ఇంకోవైపు అబద్ధ మాడటం, లంచాలు తీసుకోవడం పాపమని "ధర్మం" (మతం) వెల్లడిస్తుంది. ఈ ప్రపంచ జీవితం ఒక పరీక్షా కాలం. కాబట్టి మనిషికి సత్కార్యాలు చేసేందుకయినా దుష్కార్యాలు చేసేందుకయినా - అంటే దైవ చట్టానికి విధేయత చూపించ డానికైనా లేక దాన్ని తిరస్కరించడానికయినా దైవం ఈ లోకంలో స్వేచ్ఛ నివ్వాలి. అలాగే ఆ స్వేచ్ఛనిచ్చాడు దేవుడు. అయితే అంతమాత్రాన మానవ ప్రభుత్వాలు, ప్రభుత్వ సిబ్బంది, ప్రభుత్వ చట్టాలు శక్తిహీనమయినట్లు దైవం, దైవ చట్టాలు, దైవ దూతలు కూడా అశక్తులని తలచడం చాలా పొరపాటు.

## సర్వాధికారి ఒక్కడే

ఇంతటి చిత్రవిచిత్రమయిన, ఇంత నియమబద్ధంగా నడిచే ఈ ప్రపంచం ఏ ఒక సృష్టికర్త, యజమాని, ప్రభువు లేకనే తానంతట తానుగా పుట్టిందా? ఇలా జరుగుతుందని ఏ మానవ మేధస్సూ ఒప్పుకోజాలదు. దైవాన్ని విశ్వసిం చడం ఆయన్ని ప్రార్థించడం మానవ ప్రకృతిసిద్ధమయిన గుణం కాబట్టి మాన వులు దైవాన్ని చూడకపోయినా తమ తృప్తికిగాను ఏ ఒక సూర్యుడినో, చంద్రు డినో, చెట్టునో, పుట్టనో పూజిస్తున్నారు. దైవాన్ని నమ్మక తిరస్కరించే ధైర్యం మానవునికి లేదు. తనకు తెలియకనే దైవాన్ని తిరస్కరించే పదాలు పలికినా మరుక్షణంలోనే దైవాన్ని నమ్మటం అనేది అతనికి అనివార్యం. కాబట్టి ప్రతి వ్యక్తి ఏదో ఒక విధంగా దైవాన్ని నమ్ముతున్నాడనేది మనం చూస్తూనే ఉన్నాం.

అయినా మానవ స్వేచ్ఛాభిలాష, మానవునికి ఒకే ఒక దైవాన్ని, సృష్టికర్త, పోషకుడు, ప్రభువు, పాలనాధికారి, ఆజ్ఞాపించేవాడు, నిషేధించేవాడు అని నమ్మి ఆయనకు ఆయన చట్టాలకు తన పూర్తి జీవితాన్ని అంకితం చేయటానికి ఎంత మాత్రం అనుమతినివ్వదు. కాబట్టి దైవాన్ని నమ్మేవారు ఎన్నో రకాల నమ్మకాలు సృష్టించుకున్నారు: దేవుడు లోకాన్ని సృష్టించి ఈ లోకాలతో ఎట్టి సంబంధం పెట్టుకోక ఎక్కడో ఉండిపోయాడని, లేక దేవుణ్ణి పూజా పురస్కారాలచేత సంతోష పెట్టడం తప్ప మరే చట్టాలను అమలుపరచే అవసరంలేదని, ఇతర దేవతలను మెప్పించి మనం ఆ సృష్టికర్త కరుణాకటాక్షాలను పొందగలమని, దైవ కుమారుళ్ళను విశ్వసిస్తే దైవాన్ని మెప్పించ సాధ్యమవుతుందని నమ్ముతున్నారు. పూజా పురస్కారాలు, భక్తిగీతాలు మరియు భజనల్లాంటి మత కార్యక్రమాలను జరిపితే చాలు, మత జీవితం పొందవచ్చని, ఇవి తప్ప జీవితంలోని ఇతర రంగాలకు సంబంధించిన కార్యక్రమాలకూ మతానికీ మరియు మత నియమాలకు ఎట్టి సంబంధంలేదని, వాటిని మనం మన ఇష్టానుసారం పాటించినా మతానికి ఎలాంటి విఘాతం ఏర్పడదని నమ్మేవారు కూడా ఉన్నారు. తమ ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించడానికే ఈ మార్గాల్ని అవలంబించారు మానవులు.

## సృష్టికర్తే పరిపాలకుడు

అలాకాక ఈ అద్భుత సృష్టి యొక్క సృష్టికర్త దీన్ని నడిపించే శక్తిసామర్థ్యాలు లేకపోవడం చేత దీన్ని దీని మానాన వదిలేశాడా? సకల మానవాళి అవసరాల్ని తీర్చే ఆ మహాదయాసాగరుడు, మానవాళికి తప్పు-ఒప్పు, ధర్మం - అధర్మం, మంచి-చెడులు ఏవో మరియు తన మెప్పు పొందే మార్గమేదో చూపకుండా వారిని అంధకారంలోనే ఉంచి వారి నిష్ప్రయోజనమయిన పూజాపురస్కారాలతో, భజన, భక్తిగీతాలతో సంతోషపడతాడా? తన నియమాల్ని, చట్టాల్ని అనుసరించక ఇతర దేవతల్ని తనకు సాటిగా దైవత్వం కల్పించి వారిని మెప్పించ ప్రయత్నించే

వారిపై తన కరుణా కటాక్షాలను కురిపిస్తాడా? దైవానికి సంతానమున్నట్లు భావించి దైవ కుమారుణ్ణి విశ్వసించే వారికి మోక్షాన్ని ప్రసాదిస్తాడా? అంతేకాదు, ప్రపంచ శాంతి సౌభాగ్యాలకు ఏ విధంగాను తోడ్పడని పూజా పురస్కారాలు భక్తి భావనలు ఇంకా వస్త్రధారణ ఆహారాది విషయాలను మాత్రం సూచించి మిగతా జీవితంలోని అత్యధిక భాగం కొరకు, లోకంలో శాంతి అశాంతులకు మూలాధారమయిన మన జీవిత వ్యవహారాల కొరకు ఎలాంటి నిబంధనలను ఏర్పరచక వాటిని మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వదలిపెట్టి పూరుకున్నాడా ఆ దైవం?

## మతం వేరు, జీవితం వేరు?!

ప్రస్తుతం మన ధార్మిక కార్యాలుగా చెలామణి అవుతున్న పూజా పురస్కారాలు, జనన మరణ వ్యవహారాల్లో, సంతోషం దుఃఖం వేళల్లో మనం జరిపే ఆచారవ్యవహారాలు జరపకున్నా టోపీలు, లాగులు, మన కట్టుబాట్లు, గడ్డం, ధోవతులు, పంచెలు, పిలకా, జంధ్యంలాంటివి ధరించినా, ధరించకపోయినా శాకాహారమో-మాంసాహారమో ఏది అవలంబించినా ఈ ప్రపంచ గమనంలో ఎలాంటి మార్పు రాదే! ఇవన్నీ లోకశాంతికి నైతిక నడవడికి ఏ విధంగాను తోడ్పడేవి కావు. ఇట్టి ఆచారాలను మనం మతం పేరిట ఆచరిస్తున్నాము. లోక శాంతి కోసం నైతిక విలువల కోసం అవసరమయ్యే ఎన్నో వనరులను మనం 'లౌకిక వ్యవహారాలు' అని పేరు పెట్టుకొని మతానికి వాటితో ఎలాంటి సంబంధం లేదని మతం ఒక వ్యక్తిగత విషయం అని ఇతర అన్ని పనులు రాజకీయమయినవి, సాంఘికమయినవి, ఆర్థికమయినవని చెప్పుకుంటున్నాం. ఇలా మానవ జీవితాలు మత జీవితం, సాంఘిక, ఆర్థిక, రాజకీయ జీవితాలుగా విభజించటానికి వెనక నేను చెప్పినట్లుగా మానవుని ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోరికలే తెరమరుగున ఉండి మానవుణ్ణి ప్రేరేపిస్తున్నాయి. అయితే మన సాంఘిక సమస్యలయినటువంటి వివాహం, కుటుంబ వ్యవహారాలు, వారసత్వం, వ్యాపారం, వాణిజ్యం, విద్య ఇత్యాది విషయాలకు సంబంధించిన సకల

సమస్యలలోను, రాజకీయ వ్యవహారాలయిన పరిపాలన న్యాయం, యుద్ధం, సంధిలాంటి సమస్యలలోను ఎలాంటి ఆదేశాలివ్వని ఆ దేవుణ్ణి పూజించవలసిన అవసరం ఏమిటో అర్థం కావడం లేదు.

దేవుణ్ణి నమ్మకుండా ఆయన్ని తిరస్కరించే "నాస్తికుని"కి తన జీవితం మొత్తాన్ని తప్పుగానో, ఒప్పుగానో తన ఇష్టానుసారం గడుపుకునేందుకు స్వేచ్ఛ, వీలు ఉంది. కాని దేవుణ్ణి నమ్మేవారు తమ జీవితాలను మత సంబంధమయిన జీవితం అని - సాంఘిక లేక రాజకీయ జీవితం అని వేరు వేరు విభాగాల్లో విభజించడానికి ఏమాత్రం వీలున్నట్లు కానరావడం లేదు. అలా విభజించడంలో ఔచిత్యమయినా, సమంజసత అయినా ఉన్నట్లు కూడా బోధపడటం లేదు.

## ప్రభుత్వ పరిధి విస్తరిస్తోంది

ఒక వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలో తన యావత్తు జీవితాన్ని దైవదాస్యానికే అంకితం చేసి తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను విడనాడటానికి ఎలా ఇష్టపడడో, అదే విధంగా సామూహిక రంగంలోను ప్రభుత్వాధికారాలు కలవారు కూడా తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల అభిలాషను తమ దేశం, తమ ప్రజలనిపించుకునే వాటి ద్వారా నెరవేర్చుకోడానికి ప్రయత్నిస్తారు. ప్రజల జీవితాలను మత సంబంధమయిన జీవితం అని, సాంఘిక, రాజకీయ జీవితం అని విభజించి, తమ జీవితంలో ప్రాముఖ్యతలేని బహుకొద్ది భాగంలో ప్రజలకు స్వేచ్ఛనిచ్చి రాజకీయ, సాంఘిక జీవితంలో అతి ముఖ్యమయిన అధిక భాగాన్ని తమ ఈ స్వేచ్ఛాభిలాషను తీర్చుకోడానికే ఉపయోగించుకుంటారు.

అలా ఉపయోగించ వీలు కలగటానికే మానవ జీవితాన్ని రెండు భాగాలుగా విడగొట్టి, మతం ఒక వ్యక్తిగత విషయమని దేశంలో ప్రతి వ్యక్తి తన ఇష్టానుసారం మతాన్ని తన వ్యక్తిగత విషయంగా అవలంబించవచ్చునని, అలాంటి మతంతో సాంఘిక మరియు రాజకీయ విషయాలకు ఎట్టి సంబంధం ఉండకూడదు అనే మాటలు వినవస్తున్నాయి. మన దేశంలో సైతం ఈ కాలం

లోను, "మతం ఒక వ్యక్తిగత విషయం" అనే నినాదాన్ని వింటూనే ఉన్నాం. దేవుడు ఒక్కడే, ఆయన్ని నిరాటంకంగా, ఆనందంగా ఇష్టానుసారం మానవుడు తన వ్యక్తిగత జీవితంలో పూజించి సేవించవచ్చు కాని ప్రాపంచిక విషయాల్లో దైవం, మతంయొక్క ప్రమేయం ఉండకూడదని, సాంఘిక, రాజకీయ జీవితాలు దైవం మరియు మతానికి లోబడక స్వతంత్రంగా ఉండాలని; సమాజం, విద్య, ఆర్థిక విషయాలు, చట్టాలు, పార్లమెంటు రాజకీయాలు, దేశీయాంగ, విదేశాంగ వ్యవహారాలన్నీదైవం మరియు మతం ప్రమేయం లేకుండా లౌకిక పునాదులపై మనిషి జ్ఞానం, ఇష్టం ఆధారంగా నిర్మింపబడాలని; ఈ విషయాల్లో దైవాజ్ఞ ఏమిటి? అని ఆలోచించటం కేవలం సంకుచితమయిన విషయమని భావింప బడుతున్నది.

## జీవితం విభజించరానిది

సునిశితంగా పరిశీలిస్తే దేవుడు, మతం మరియు వ్యక్తిగత విషయాలు అని అనుకోవడం కేవలం అర్థరహితం. దేవుడు వాస్తవంగా మనకు, ఈ విశ్వానికి సృష్టికర్త యజమాని మరియు అధికారి అయినప్పుడు ఆయన అధికారం కేవలం వ్యక్తిగత జీవితానికే పరిమితం చేయడం, ఇద్దరు లేక ఇద్దరికంటే ఎక్కువ వ్యక్తులతో ఏర్పడే ఈ సంఘంలో ఆయన అధికారాలకు తావు లేకుండటం అర్థరహితం! సామాజిక జీవితంలో దేవుణ్ణి గుర్తించక తన ఇష్టానుసారం వ్యవహరించడం ఆ సృష్టికర్త, యజమాని, ప్రభువు ఎడల ద్రోహమే అవుతుంది. ఇట్టి ద్రోహానికి వడిగడుతూనే, తాను వ్యక్తిగతంగా దేవుణ్ణి విశ్వసిస్తున్నాను అని పలికేవాడు కేవలం అవివేకియే అని చెప్పవచ్చు. ప్రతి వ్యక్తి వ్యక్తిగతంగా దేవునికి దాసుడే, అట్టి వ్యక్తుల సమాజం ఏర్పడగానే వ్యక్తులందరూ దేవునికి దాసులు కారంటే ఇంతకంటే వేరే వ్యర్థ ప్రలాపం ఇంకేముంటుంది? మన కుటుంబం, మన సమాజం, మన పట్టణం, మన వీధి, మన పాఠశాల మరియు కాలేజి మన అంగళ్ళు, మన బజారు, మన పార్లమెంటు, మన గవర్నమెంట్

హౌస్, మన సెక్రటేరియట్, మన సైనిక శిబిరం, మన పోలీసులు, మన యుద్ధ భూమి, మన సంధి సమావేశాలు ఒకటేమిటి, మన జీవితంలోని ప్రతి రంగం లోను దైవాదేశాల యొక్క అవసరం లేకుంటే ఆ దైవాదేశాల అవసరం మరెక్కడ ఏర్పడుతుంది? లేక, ఆ దేవుడు మనకు మన జీవన వ్యవహారాల్లో ఎలాంటి మార్గాన్ని చూపలేని అసమర్థుడని వీరి భావమా?

అసలు మానవుని "వ్యక్తిగత జీవితం" అనే పదమే అర్థరహితమయినది. మనిషి జీవితమంతా సామాజికమే. అతనికి తన సంఘం, తన గ్రామం, తన జాతితో సంబంధముంది. వైజ్ఞానిక, రాజకీయ విధానంలోనూ అతనికి సంబంధం ఉంది. ఈ వివిధ సంబంధాలను సంస్కరించడంలో మాత్రమే ప్రతి వ్యక్తి యొక్క వ్యక్తిగత సామూహిక శ్రేయస్సు వుంది. ఈ సంబంధాల సక్రమమయిన, న్యాయమయిన మరియు దృఢమైన హద్దులను మానవుని సృష్టికర్త అయిన దేవుడు మాత్రమే నిర్ణయించగలడు. దైవోపదేశాలను పాటించకపోవడం మూలాన సామూహిక జీవిత రంగం మత ప్రసక్తిలేని లౌకిక (Secular) విధానంగా మారి, వ్యక్తిగత స్వార్థానికి, వంశం, వర్గం, జాతి ఆధారంగా సంకుచిత దురభి మానాలకు ఆస్కారం ఏర్పడింది.

ప్రస్తుతం మనముందు ఉన్న సమస్య మతానికి, రాజకీయాలతో సంబంధం ఉందా? లేదా? అన్నది. ఈ విషయాన్ని కొందరు గ్రహించక పొరబడుతుంటే ఇంకొందరు స్వార్థపరులు ఎంతో యుక్తిగా తమ వాగ్దాటితో మత వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు.

## మతమే సహనాన్ని నేర్పుతుంది

ప్రతి వ్యక్తి తన శరీరాన్ని ప్రేమించి కాపాడుకున్నట్లే తన కుటుంబాన్నీ, తన ఇంటిని, తన గ్రామాన్ని, తన దేశాన్ని అదే విధంగా తాను నమ్మే మతాన్ని ప్రేమించి కాపాడుకోవడం అనేది సహజం. తన శరీరాన్ని కాపాడుకోవడంలో ఇంకో శరీరానికి కీడు కలిగించడం గాని, తన కుటుంబాన్ని ప్రేమించటంలో

ఇంకో కుటుంబాన్ని ద్వేషించడం గాని, తన ఇంటి సుఖం కోసం ఇతర ఇండ్లకు కష్టం కలిగించడంగాని, తన గ్రామం లేక దేశ శ్రేయస్సు కోసం ఇంకో గ్రామమో లేక ఇంకో దేశానికో నష్టం కలిగించటంకాని ఎలా భావ్యం కాదో అదే విధంగా తాను నమ్మిన మతం ప్రేమలోపడి దాన్ని రక్షించడానికి ఇంకో మతం వారిని దూషించడం, ద్వేషించడం ఎంత మాత్రం సబబు కాదు. ఒక మతంలో "ఇంకో మతాన్ని ద్వేషించండి" అనే ఆదేశాలుంటే ఆ మతం అసలు మతమే కాదు. తమ మతాన్ని ప్రేమించటం వేరు విషయం మరియు ఇతర మతాలను ద్వేషించటం అనేది వేరే విషయం. ఇతర మతాలను ద్వేషించేవారు మతోన్మాదులే కాని మత ప్రేమికులు కారు.

ఈ సూత్రం ఒక మత విషయంలోనే కాదు, ప్రతి సామూహిక విషయానికీ వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక రాజకీయ సంస్థకు చెందిన వ్యక్తికి ఆ సంస్థ అంటే ఎంతో గౌరవాభిమానాలు ఉంటాయి. అతనికి ఆ భావం ఉండ వలసిందే. కాని ఇతర సంస్థలను ద్వేషించటం అనేది ఆ వ్యక్తికి తగిన విధానం కాదు. అతడు తన సంస్థ సూత్రావళిని, నియమావళిని ఇంకొకరి ముందు విడమర్చి తెల్పుతూ మరొక సంస్థలో ఉన్న లోటుపాట్లను సక్రమ రీతిలో విమర్శించవచ్చు. కాని ద్వేషించరాదు. అంటే విమర్శించడం వేరు, ద్వేషించడం వేరు. అదే విధంగా ఒక మతం ఎడల సానుభూతిగల వ్యక్తి తాను నమ్మిన మతంలోగల భావాన్ని, దాని ఆచరణా విధానాన్ని యోగ్యతను, దాన్ని అనుసరిస్తే కలిగే మంచిని, దాని సంస్కరణాత్మక శక్తినీ, పరిపూర్ణంగా తన మాటల ద్వారా చేతల ద్వారా విశదీకరించవచ్చు. కాని, ఇతర మతాల్ని ద్వేషించడం ఎన్నటికీ తగదు. ఈ విషయంలో మతపరమయిన సంస్థకుగాని, రాజకీయ లేక ఇతర సంస్థకుగానీ ఏమీ తేడా లేదు.

అయినప్పటికీ మత ఘర్షణల పేరిట జరిగే సంఘర్షణల్లో యదార్థంగా మతానికి ఎంత సంబంధం ఉంటుందో ఆలోచించండి. ఒక వ్యక్తిగాని, సంఘంగాని, ఇతర వ్యక్తితో లేక సంఘంతో ఘర్షణకు దిగినప్పుడు అతడు తన

మతం యొక్క రక్షణ కోసమే అలా ఘర్షించుతున్నాడనుకోవడం శుద్ధ పొరపాటు. మతాలు ఘర్షణవల్ల, వైరాలవల్ల రక్షించబడజాలవు. ఇలాంటి భావాలన్నీ ఛాందసుల భావాలు. తమ తమ ఉద్దేశాలను, ఆశయాలను ప్రచారం చేసి ప్రజానీకంలో ఏకాభిప్రాయం సాధించడానికి ప్రయత్నించడం మతసేవ అనబడు తుంది గాని, సంఘర్షణ ద్వారా మతానికి ఎలాంటి సేవ చేయడానికి వీలుపడదు. ఇలాగనే ఒక రాజకీయ సంస్థ సేవకుడు తన సంస్థ ఆశయాలను, ఉద్దేశాలను ప్రచారం చేసి ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా మార్చుకుని తాను తన సంస్థ సేవ చేయగలడుకాని ఇతర సంస్థలతో ఘర్షించి తాను తన సంస్థ యొక్క సేవ ఏమాత్రం చేయజాలడు. కాబట్టే ప్రజాస్వామ్య విధానంలో, ప్రతి వ్యక్తికి, ప్రతి సంస్థకు రాజకీయంగా తమ ఆశయాలను శాంతియుత పద్ధతి ద్వారా ప్రచారం చేసుకొనే హక్కు కల్పించబడింది. కనుక ప్రతి రాజకీయ సంస్థ తన ఆశయాలను విచ్చలవిడిగా ప్రచారం చేసి ప్రభుత్వ ఆశయాలతోపాటు ఇతర సంస్థల ఆశయాలను సయితం విమర్శించటం, అట్టి విమర్శలను ఇతర సంస్థలు విశాల హృదయంతో సహించడం జరుగుతుంది. ఈ విధంగా ప్రతి సంస్థకు ఆ సంస్థ సాధించిన ఘనకార్యాలు వెల్లడించి ప్రజాభిప్రాయాన్ని మలచుకునే అవకాశం లభిస్తుంది.

## మతం ఘర్షణకు మూలం కాదు

కాని మతపరమయిన సంస్థలు తమ ఆశయాలను బహిరంగంగా ప్రకటించి ఇతరులను సహేతుకంగా విమర్శించినా ప్రమాదం వాటిల్లుతుంది అని కొందరు దేశభక్తులు చెప్పేది మనం తరచుగా వింటూనే ఉన్నాం. మతంలో, మత స్వేచ్ఛలో, మత ప్రచారంలో అలాంటి వారికి ప్రమాదం ఎందుకు కనబడుతుందో అర్థం కావటం లేదు. ప్రస్తుతం ప్రజల్లో కనబడే ఈ కొద్దిపాటి సత్యం, సదాచారం, న్యాయం, ధర్మం, నీతి, నిజాయితీ, విశ్వసనీయత, ప్రభుత్వాలు మరియు రాజకీయాలు ఇచ్చే ప్రోద్బలం వల్లనే అని వాగు

భావిస్తున్నారు కాబోలు. అలాంటి వారి భావన పూర్తిగా అసమంజసం. మనం కొంచెం సేపు ప్రశాంతంగా ఆలోచిస్తే ఇప్పటికీ ప్రపంచంలో మిగిలి ఉన్న నీతి, నిజాయితీ, న్యాయం, ధర్మం లాంటిది కేవలం మత ప్రభావం మూలంగానే అని ఒప్పుకోక తప్పదు. మత తిరస్కారుల్లో నాస్తికుల్లో కనబడే నీతి నిజాయితీ కేవలం వారి స్వార్థపూరితమయినవే తప్ప మరేమీ కావు. దైవాన్ని నమ్మకుండా దైవకృపను ఆశించకుండా జీవించే వ్యక్తి-నీతి నిజాయితీకల మార్గాన్ని ఎందుకు అవలంబిస్తాడో ఆలోచించండి. ఏదో స్వలాభాపేక్ష తప్ప మరేదీ అతన్ని నీతిమంతంగా జీవించడానికి పురికొల్పజాలదు. అతడు పచ్చి స్వార్థపరుడయి ఉంటాడు. అతడు కుటుంబం, గ్రామం, దేశం పేరు చెప్పినా యదార్థంగా అది అతని వ్యక్తిగత స్వార్థమే అయి ఉంటుంది. అతడు నిస్వార్థంగా తనకు తప్ప మరెవరికీ సేవ చెయ్యలేడు.

ప్రజల్లో నీతి నిజాయితీని జనింపజేయటానికి మత ప్రచారం అతి ముఖ్యం. మతంపై విశ్వాసం, ప్రళయదినాన దైవం ఎదుట జరిగే తీర్పు మరియు అక్కడ పొందే కర్మఫలాలపై విశ్వాసం, మానవుణ్ణి దుర్మార్గాల నుండి సన్మార్గం వైపునకు త్రిప్పడంలో తోడ్పడేటట్లు ఇంకే ప్రభుత్వ చట్టాలు, భటులు, రక్షక సిబ్బంది తోడ్పడజాలవు.

దేశ ప్రజల్లో అట్టి మత విశ్వాసాల ప్రచారం కోసం పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలిచ్చి దానికి తగు సౌకర్యాలు కలుగచేయటమే గాక, దేశ క్షేమం, శాంతి సౌభాగ్యం కోసం స్వయంగా ప్రభుత్వాలు కూడా మత వ్యవస్థకు తోడ్పాటునివ్వాలి. కాని జరిగేదేమంటే అధికారంలో ఉన్నవారు దైవ నియమాలను తాము పూర్తిగా అనుసరించక, తమ స్వేచ్ఛాభిలాషను వదలుకోలేక తమ వ్యక్తిత్వంతోపాటు అధికారాన్ని కూడా పెడమార్గం పట్టించారు. మతం ఒక వ్యక్తిగత సమస్య అని, అది పూజా పురస్కారాలు, భక్తిగీతాలు మరియు భజనలమట్టుకే పరిమితమయిందని, అది మస్జిదుల్లో, చర్చిల్లో మరియు దేవాలయాల్లో మాత్రమే చెల్లుతుంది, నిజ జీవితంలో దానితో ఎలాంటి అవసరం లేదు అని, మతానికి ప్రాపంచిక జీవితంతో ఎలాంటి సంబంధంలేదని వారు చాటుతున్నారు.

ఇలా మతానికీ, నిత్య జీవితానికీ కల్పించే వేర్పాటును దైవ ధర్మం ఎన్నటికీ ఒప్పుకోదు. దేవుడు మానవుణ్ణి సృష్టించాడు. ఆయనే అతని ప్రభువు, స్వామి. అందువల్ల మనిషిపై సర్వాధికారాలు ఆయనకే చెందుతాయి; మానవుడు తన జననం మొదలుకొని మరణం వరకు జీవితం మొత్తాన దైవానికే దాసుడు. మస్జిదుల్లో, దేవాలయాల్లో మట్టుకు ఆయనకు దాసుడు, ప్రార్థనా లయాల నియమాలమట్టుకే దైవాదేశాల్ని శిరసావహించి, న్యాయస్థానాల్లో, శాసన సభల్లో, పార్లమెంటు హౌసుల్లో ఇంకా జీవితంలోని అన్ని రంగాల్లోను ఆయన ఆదేశాల్ని శిరసావహించాల్సిన అవసరం లేదు అని అనుకోవడం ఎంత మట్టుకు సమంజసం? కాబట్టి మానవుడు తన జననం మొదలుకొని తన మరణం వరకు గల అన్ని దశల్లోనూ దైవానికి దాసుడే. తల్లి ఒడిలో తాను పొందే శిక్షణ, బాల్యంలో పొందే విద్యలగాయతు తన సంసారం, తన కుటుంబం, తన విజ్ఞాన ఆర్థిక విషయాల్లోనూ ఇంకా సాంఘిక, రాజకీయ విషయాల్లో కూడాను దైవాన్ని, ఆయన ఆదేశాలను శిరసావహించే బాధ్యతను కలిగి ఉన్నాడు మానవుడు.

అలాంటప్పుడు ప్రపంచంలో ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకున్న వారు, తమ ఈ అధికార బలం ద్వారా, తమ స్వార్థం కొరకు, ఆ మానవునిపైన్నే తమ ధర్మ తిరస్కార సిద్ధాంతాల్ని, చట్టాల్ని రుద్ది దైవదాస్యానికి బదులు తమ దాస్యం చేయమని బలవంతం చేస్తుంటే మనిషి దైవదాస్యం చేయడం ఎలా సాధ్యపడుతుంది? ప్రస్తుత ప్రపంచం అంతా ఇదే స్థితిలో ఉంది.

## ప్రభుత్వం - ప్రజాశ్రేయం

గతంలో ప్రభుత్వాధికారానికి ఒక హద్దు పద్దూ అనేది ఉండేది. పరి పాలకులు ప్రజల సుఖశ్రేయాల కోసం వారినుండే శిస్తు, పన్నుల ద్వారా కొంత ధనాన్ని సేకరించి శాంతి భద్రతలు నెలకొల్పడానికి తగు చర్యలు తీసుకునేవారు. ప్రజల సౌకర్యం కోసం రోడ్లు రహదారులు, ఆసుపత్రులు వగైరాల ఏర్పాట్లు

చేసేవారు. ప్రభుత్వం అంటే అంతమట్టుకే జోక్యం కల్పించుకునేది. ఆ కాలంలో ప్రభుత్వాలు తమ ప్రజల మత సంబంధమయిన విషయాల్లో, ఆచార వ్యవహారాల్లో వారికి పూర్తి స్వేచ్ఛను ఇస్తూ ఉండేవారు. కాని నేటి మన ప్రభుత్వాల అధికారాలకు ఒక మితం అనేది లేదు. నేడు పరిపాలనా పరిధి మనుషుల వ్యక్తిగత వ్యవహారాల వరకు సయితం విస్తరించింది. భూస్వాముల భూములకు, ధనవంతుల ధనానికి పరిమితి నిర్ణయించటం మొదలుకొని క్రమంగా ఒక వ్యక్తి పెళ్ళాడటానికి భార్యల సంఖ్యను, ఆ భార్యలు కనే పిల్లల సంఖ్యను కూడా ప్రభుత్వం నిర్ణయించే రోజులొచ్చాయి.

ఇక ఈ స్థితిలో ప్రజలకు స్వేచ్ఛ ఏమాత్రముంటుంది? ఇలా కాలం గడుస్తున్న కొద్దీ వారు తమ మత సంబంధమయిన విశ్వాసాల్నే మరచిపోతూ ఉంటే వారి నీతి నిజాయితీ ఎలా కాపాడబడుతుందో ఎవరూ చెప్పలేరు.

ఒక తహసీలుదారుకు తన హోదా పెరిగి కలెక్టరు అయ్యే ఆశ ఎలా కలుగుతుందో, ఒక మంత్రికి ప్రధాన మంత్రి పదవిని అలంకరించే కోరిక ఎలా ఏర్పడుతుందో, అలాగే ఒక ప్రభుత్వానికి తన అధికారాలను విస్తరింపజేసి దేశ ప్రజల వ్యక్తిగత కుటుంబ సంబంధమయిన జీవితంపై కూడా తన అధికారాన్ని చలాయించే ఆశ కలుగుతుంది. అది సహజం!

పైన పేర్కొన్నట్లు, సర్వలోక సృష్టికర్త, యజమాని మరియు స్వామి ఆ ఏకైక దేవుడే అనటంలో ఎలాంటి సందేహం లేదు. అధికారి, పాలకుడు, ప్రభువు, స్వామి ఆయనే. ఆయన తప్ప ఇంకెవ్వరూ "స్వామి" "ప్రభువు" కాజాలరు. ప్రజలకు గల పరిపాలనాధికారం మనం మానవుల చేతికిచ్చి "ప్రజా స్వామ్యం" అనే ఒక రాజకీయ పదాన్ని సృష్టించాం. ప్రజలు ప్రజలకు స్వాములు ఎన్నటికీ కాజాలరు. ప్రజల్ని పరిపాలించే హక్కు ప్రజలకు ఉండదు. ఆ హక్కు కేవలం ఈ లోకాన్ని, మనలనందరినీ సృష్టించిన ఆ సృష్టికర్తకే చెల్లుతుంది. మానవకోటి, ఆ ప్రభువు ఆదేశాలను మనస్ఫూర్తిగా శిరసావహించి అనుసరించేటట్లు, మరే ప్రజా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశా

లనూ విశ్వసించజాలదు. దైవాజ్ఞలను వ్యతిరేకించటానికి మానవుడు భయపడతాడు. ప్రజా ప్రభుత్వపు ఆజ్ఞల్ని ఉల్లంఘించటానికి వెనకాడడు. దైవాన్ని విశ్వసించే వ్యక్తి దైవకృపను దైవ కటాక్షాన్ని ఆశించి తన ధన ప్రాణాలను సైతం ఎంత సంతోషంగా, ఎంత చిత్తశుద్ధితో ఆయనకు అర్పించడానికి సిద్ధమవుతాడో ప్రజా ప్రభుత్వం మెప్పుకోసం ఆ విదంగా ఎలాంటి త్యాగానికి తయారవడు.

## మనిషికి విశృంఖల అధికారాలిస్తే...

అదే విధంగా ప్రజాస్వామ్య వ్యవస్థను "ప్రజా ప్రభుత్వం" అనగానే అది పూర్తిగా ప్రజల ప్రభుత్వం అసలే కాలేదు. ఒక దేశంలో ఆ దేశం యొక్క పూర్తి జనాభా యొక్క ప్రభుత్వం ఏర్పడటం అనేది అలవిగాని పని, నిత్యం అది మెజా రిటీ ప్రభుత్వంగా మాత్రమే ఉండగలుగుతుంది. ఆ ప్రభుత్వంలో ప్రతి సమస్య మెజారిటీ ఓటింగు ద్వారానే తేల్చబడుతుంది. అయినా మెజారిటీ మారినప్పుడల్లా ఒకే సమస్యకు పలు పరిష్కారాలు ఏర్పడటం సంభవమే. ఉదాహరణకు మద్యపానాన్నే తీసుకుందాం. మద్యపాన నిషేధాన్ని కోరే వారి మెజారిటీ ఉన్నప్పుడు మద్యపానాన్ని నిషేధించింది ప్రభుత్వం. ఆ తరువాత నిషేధాన్ని తొలగించాలి అన్నవారి మెజారిటీ వస్తే అప్పుడా నిషేధం సులభంగా తొలగిపోయింది. ప్రజా ప్రభుత్వం అనిపించే, ఈ నిలకడలేని చట్టాలు గల ప్రభుత్వంలో ఇలాంటి సంఘర్షణను సదా చూస్తూనే ఉన్నాం. ఇట్టి ప్రజాస్వామ్య వ్యవస్థ పేరుతో ప్రజలకు సంపూర్ణమయిన ప్రభుత్వాధికారాన్ని ప్రసాదించటం వాస్తవికంగా అపాయకరమని మనం గ్రహించగలం.

## అసలు అధికారం అల్లాహ్‌కే

కాబట్టి ప్రజల్ని సృష్టించి పోషించేవాడు, వారి అవసరాలకు కావలసిన వస్తు సామగ్రిని ప్రసాదించేవాడు, ప్రపంచంలోని కార్యకలాపాలన్నీ నిర్వహించే వాడు, ఆ నిర్వహణ కొరకు సరియైన చట్టాన్ని రూపొందించినవాడు అయిన

దైవానికే సంపూర్ణ ప్రభుత్వాధికారం చెల్లుతుంది. ఇలాంటి సర్వ సంపూర్ణ ప్రభుత్వాధికారం ఏ ఒక వ్యక్తికో, ఏ కుటుంబానికో, ఏ జాతికో లేక ఏ కొందరు ప్రజలకో ఉండాలనటం సరి అయిన అభిప్రాయం కాదు. ఇలాంటి లోప భూయిష్టమయిన అభిప్రాయాన్ని ఒక ప్రమాణంగా తీసుకొని, ప్రభుత్వాధికారం దైవానికి కాక ఇతరులకు ఉందని అనటం వారి అవివేకాన్ని, అజ్ఞానాన్ని చాటుతోంది. దైవాన్నే సర్వాధికారిగా అంగీకరించి మానవ శ్రేయస్సు ఆయన సూచించిన మార్గదర్శకత్వంలోనే ఉందని మరియు మానవ ప్రాతినిధ్య "ఖిలాఫత్ (Vicergency)" సిద్ధాంతం ద్వారా ఏర్పడే ప్రభుత్వ వ్యవస్థలోనే మానవ కళ్యాణం ఉందనటమే వాస్తవికత దృష్ట్యాను, పర్యవసానం దృష్ట్యాను సమంజస మయినది. ఈ వ్యవస్థలో ప్రజాభిప్రాయాన్ని అనుసరించే పరిపాలనా వ్యవస్థ ఎన్నుకోబడాలి. ప్రజలకు పరిపాలకులను విమర్శించే, గద్దె దింపే అధికార ముంటుంది.

ఒక దేశమే కాదు, ప్రపంచం మొత్తం దేవునిదే. మనమంతా ఆయన ప్రతినిధులం. ప్రతి విషయం గురించి అసలయిన యజమాని దైవానికి జవాబు చెప్పవలసి ఉంది అనే భావంతోనే ప్రజలు మసలుకోవాలి. మన కోసం దైవం నిర్ణయించిన నైతిక విలువల్ని, శాసనాల్ని, హద్దుల్ని స్థిరమయినవిగా నమ్మాలి. అయితే దేవుడు మనకు ఒసగిన ఆదేశాల్లో ఎలాంటి హెచ్చుతగ్గుల్ని చేయకుండా, అవసరాల రీత్యా ఆ ఆదేశాలకు లోబడి నియమాలు చేసుకోవచ్చు. దైవాజ్ఞలు లేని విషయాల్లో ఆ దైవమే మనకు స్వేచ్ఛ ఇచ్చాడు. అలాంటి సందర్భాల్లో పరస్పర సలహా సంప్రదింపుల ద్వారా చట్టాలు చేసుకోవచ్చు. అలా నిర్మించబడే చట్టాలు మూలసూత్రాలకు, సంఘ స్వరూపానికి అనుకూలంగా ఉండాలి అనే విషయం ఆ రాజ్యాంగంలోని మౌలిక సిద్ధాంతంగా ఉంటుంది.

## పాలకులు ఎలాంటివారై ఉండాలి

దైవభీతి గలవారికి, దైవాజ్ఞలనే శిరసావహించేవారికి, ప్రతి పనిలో దైవ

సమ్మతినే కోరేవారికి, దైవం ఎదుట హాజరయి సమాధానం ఇవ్వవలసి ఉందనే భావం కలిగిన వారికి మాత్రమే ఈ ప్రాతినిధ్య ప్రభుత్వపు అధికారాలు అప్పజెప్పాలి. అలాంటి వ్యక్తుల్ని కాక, హద్దూపద్దూ లేకుండా, కనబడిన ప్రతి చేనులో మేసే త్రాడులేని పశువుల్లాంటి వారిని కాక దైవ నియమావళి అనే త్రాటితో "దైవ భక్తి" అనే కట్టుగొయ్యకు కట్టబడి ఆ త్రాటి పరిధిలోనే తిరిగే టటువంటి వారికే పాలనాధికారాలు కైవసం చేయాలి.

మత ప్రసక్తిలేని లౌకిక (Secular) ప్రజాస్వామ్యానికి బదులు దైవభక్తి, మానవత్వం ఆధారంగా ఏర్పడే ప్రజా ప్రాతినిధ్యాన్ని మేము కోరుతున్నాం. ఈ రెండు విధానాల్లోని భేదాన్ని మీరిప్పుడు చక్కగా గ్రహించేయుంటారు. ఏది శ్రేష్ఠమయినది? ఎందులో మీ శ్రేయస్సు ఉంది? దేన్ని నెలకొల్పటాన్ని మీరు కోరుతున్నారు? దేన్ని నెలకొల్పాలని మీరు అభిలషించాలి? దేన్ని నెలకొల్పి స్థిరపరచటానికి మీ శక్తి సామర్థ్యాలను వినియోగించాలి అనేది మీ అంతరాత్మల తీర్మానాలపై ఆధారపడివుంది.

## మా సందేశం

ముస్లిం సోదరులతో గల సంబంధాన్ని పురస్కరించుకొని మేము వారితో చెప్పేదేమంటే, మత ప్రసక్తిలేని లౌకిక ప్రజాస్వామ్యం. మీ ధార్మిక విశ్వాసాలకు వ్యతిరేకం; దాని మౌలిక నిబంధనలు ఇస్లాం మౌలిక నియమ నిబంధనలకు విరుద్ధం. ఇస్లామ్‌కు మరియు లౌకిక ప్రజాస్వామ్యానికి ఎలాంటి పోలికలు లేవు. పవిత్ర ఖుర్‌ఆన్‌ను ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను విశ్వసించే మీరు మత ప్రసక్తిలేని లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ (Secular Democracy) లో దైవ భక్తి ప్రాతిపదికపై నిర్మింపబడిన ప్రజాప్రాతినిధ్య వ్యవస్థ కొరకు ప్రయత్నం చేయడం మీపై మోపబడిన ఒక గొప్ప విధి మరియు బాధ్యత.

ఇక ముస్లిమేతర సోదరులతో మేము చేసే మనవి ఏమంటే, దయచేసి గత చరిత్ర రీత్యా నేటి వివాదాల రీత్యా ముస్లిములు, ముస్లిమేతరుల మధ్య

ఏర్పడిన విద్వేషం వైషమ్యాలకు గురికాకుండా, మేము సూచించిన విధానాల్ని గురించి ప్రశాంతంగా ఆలోచించండి. "సిద్ధాంతం" అన్నది ఏ జాతి యొక్క పిత్రార్జితమూ కాదు. ఆ విధానాలపై ఏ జాతి ముద్ర కూడా లేదు. అవి స్వతహాగా సరియైనవి మరియు లాభదాయకమయినవి అయితే సర్వ మానవులకు లాభదాయకమైనవే. అలాకాకపోతే సర్వమానవకోటికీ లాభదాయకం కావు. ఆ విధానాలు ఎవరు సూచించారు, అవి ఏ భాషలో ఉన్నాయి అనేది సమస్య కాదు. ఆరోగ్యం, వైద్యం, వాణిజ్యం, వ్యవసాయం, విద్య మరియు ఇతర విధానాలను అవి ఫలానా జాతి వారివి అని వాటిని ద్వేషిస్తే నష్టపోయేది ద్వేషించేవారే! నైతిక, వైజ్ఞానిక, సామాజిక, సాంస్కృతిక, నాగరిక, ఆర్థిక, రాజకీయ విధానాల విషయంలో కూడా అంతే. కాబట్టి ఈ విధానాలు కూడా ఇతర జాతివి, ఇతర దేశము వారివి అనుకోకుండా వాటిని పరిశీలించి యోగ్యమయినవాటిని అనుసరిస్తే మనకే శ్రేయోలాభాలు ప్రాప్తమవుతాయి. వీటిని అనుసరిస్తే అనుసరించినవారు ఇంకొకరికి ఏదో ఉపకారం చేసినట్లు కాదు. అదే విధంగా ఎవరయినా తప్పుడు విధానాలను అనుసరించి నష్టపోతే ఆ నష్టం ఆ అనుసరించేవారికే గాని ఇతరులకు వాటిల్లదు.

మానవ శ్రేయస్సుకు భంగం కలిగించే విధానాలకు మారుగా మానవ కళ్యాణం, శ్రేయస్సును కలిగించే విధానాల్ని మీ ముందుంచాము - దైవ భక్తి ఆధారంగా ఏర్పడే వ్యవస్థ సరయినదా లేక దైవభక్తి లేనటువంటి లౌకిక వ్యవస్థ (Secular) మంచిదా? విశృంఖలమయిన ప్రజాస్వామ్యం మంచిదా లేక దైవాదేశాలకు లోబడి వున్న ప్రజాప్రాతినిధ్యం మంచిదా? దైవభీతి కలవారు పరిపాలించటం శ్రేయస్కరమా? లేక దైవభీతి లేనివారి పరిపాలన శ్రేయస్కరమా? మీరే చల్లని గుండెలతో ఆలోచించండి. మేము సూచించిన విధానాలే సరియైనవి అని, ఫలితముల రీత్యా శ్రేష్ఠమయినవని మీరు నమ్మి వాటిని అనుసరిస్తే అది మీకే శ్రేయస్కరం, ఇదే మా సందేశం.

-: సమాప్తం :-